క్లుప్తంగా

ముర్రు పాలతోనే రోగ నిరోధక శక్తి

కోనరావుపేట: ముర్రు పాలతోనే బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సూపర్‌వైజర్ గంగలక్ష్మి అన్నారు. గొల్లపల్లి(వట్టిమల్ల) అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ షీలా, ఉపాధ్యాయుడు రవీందర్, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



చందుర్తిలో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

చందుర్తి: మండలంలోని పలు పాఠశాలల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదును జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టారు. మూడపల్లి, నర్సింగపూర్, చందుర్తి, జోగాపూర్, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లె సనుగుల పాఠశాలల్లో సభ్యత నమోదు నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్‌చారి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మాడిశెట్టి మహేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మిద్దె రాములు జయంతి



రాములు(ఫైల్)

వేములవాడరూరల్: ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ ఒగ్గు కళాకారుడు మిద్దె రాములు జయంతి శనివారం జరగనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట గ్రామానికి చెందిన మిద్దె రాములు అక్షర జ్ఞానం లేకున్నా ఒగ్గు కథలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగి ఎంతోమంది ఒగ్గు కళాకారులను తయారు చేశారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న మనోహర్

ముస్తాబాద్(సిరిసిల్ల): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ డిమాండ్ చేశారు. ముస్తాబాద్‌లో కేటీఆర్ సేన మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు వంగూరి దిలీప్, యువజన శాఖ అధ్యక్షుడు శీలం స్వామి, బానుక నాగరాజు, కొప్పు లక్ష్మణ్, జహంగీర్, యాదగిరి, పిట్ల ఎల్లం, గున్నాల గణేశ్, సురేశ్, నరేశ్, షరీఫ్ తదితరులున్నారు.

పాఠశాలలో బోరు ప్రారంభం

కోనరావుపేట: సుద్దాల ఉన్నత పాఠశాలలో బోరును హెచ్ఎం మంజుల, మాజీ వైస్ ఎంపీపీ కచ్చకాయల ఎల్లయ్య శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో ప్రభుత్వ నిధులతో ఇటీవల పాఠశాలలో బోరు వేశారు. గ్రామ పెద్దలు కచ్చకాయల బాల్‌రెడ్డి, నీరటి సంజీవ్, సుంకరి రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయం తొలగింపు పూజలు

బోయినపల్లి: విలాసాగర్ గ్రామంలోని నల్ల పోచమ్మ పురాతన ఆలయాన్ని తొలగించేందుకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేసినట్లు గ్రామ భక్తులు తెలిపారు.

13న మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ విద్యాలయాల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ఈనెల 13న నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు శుక్రవారం డీఈవోకు వినతిపత్రం సమర్పించారు. గురజాల శ్రీధర్, జవాజి విమల, బాబాయ్, రాధ, లత, లావణ్య, అనిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే..

సిరిసిల్ల అర్బన్: విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలేనని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్ కన్వీనర్ మారవేణి రంజిత్ అన్నారు. పట్టణంలో ఏబీవీపీ నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కన్వీనర్ అక్కెం నాగరాజు, ప్రశాంత్, తిరుపతి, కిషోర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలు తీసుకోవాలి

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లాలోని దివ్యాంగులకు ప్రభుత్వం అందించనున్న ఉపకరణాలను అర్హులైన దివ్యాంగులు అందరూ తీసుకోవాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఆకుల సంధ్య కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడారు. ఈనెల 10న సినారె కళామందిర్‌లో పంపిణీ కార్యక్రమం ఉందన్నారు.





వీర్నపల్లి: పుట్టకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు, చందుర్తిలో..



ఇల్లంతకుంట: పుట్టకు పాలు, పసుపు, కుంకుమ సమర్పిస్తున్న మహిళలు



ఎల్లారెడ్డిపేటలో పూజలు చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

నాగుల పంచమి వేడుకలను శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయమే లేచి నూతన వస్త్రాలు ధరించి పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపించింది. మహిళలు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. నాగదేవత ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పిల్లాపాపలను సల్లంగా చూడాలని వేడుకున్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



బోయినపల్లి: గుండన్నపల్లి ఆలయం వద్ద..







వేములవాడరూరల్: పూజలు చేస్తున్న మహిళలు, వేములవాడఅర్బన్: భీమన్న ఆలయంలో పాలు పోస్తున్న మహిళలు, కోనరావుపేట: నిజామాబాద్‌లో..

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



ఆవునూర్‌లో చెక్కులు అందజేస్తున్న నాయకులు

ముస్తాబాద్: ఆవునూర్‌లో 9 మంది బాధిత కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం అందజేశారు. పలు కారణాలతో ఆసుపత్రుల్లో చేరి వైద్యం చేయించుకున్న బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా వచ్చిన చెక్కులను అందించారు. నాయకులు నక్కదాసరి రవి, సతీశ్‌చందర్‌రావు, బద్ది లక్ష్మారెడ్డి, బైరి నర్సయ్య, కనమేని శ్రీనివాస్‌రెడ్డి, పొన్నాల శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సింలు, నజీర్, అశోక్, విశ్వనాథం, మల్లారెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.
ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నాయకులు అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, లింగంగౌడ్, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న యూత్ కాంగ్రెస్ సభ్యులు

వేములవాడరూరల్: నూకలమర్రి గ్రామంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పాత్తూరి నరేశ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. సభ్యులు గడీల అజయ్, గుగ్లోతు వంశీ, వినయ్, రాహుల్, రిత్విక్, బన్ని తదితరులు పాల్గొన్నారు.
తంగళ్లపల్లి: మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ జెండా ఎగరేసి కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, యూత్ కాంగ్రెస్ నాయకులు చుక్క రాజశేఖర్, భరత్‌గౌడ్, సంతోష్, సీనియర్ నాయకులు పరశురాములు, లింగాల భూపతి, శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



తంగళ్లపల్లి: విద్యార్థినుల నృత్యం

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, పాటలు, చిత్రలేఖనం, ముగ్గులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రెహానా ఇఫ్రత్ మాట్లాడారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపాల్ అనూష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.
కోనరావుపేట: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఏటీడీవో దివాకర్ హక్కులు, ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ పథకాలపై వివరించారు. హెచ్ఎం శారదావాణి, ఉపాధ్యాయులు గీతాభవాని, రవీందర్, తిరుపతి, రాజు, కృష్ణవేణి, శ్యామల, ఊర్మిళ, మదన్‌లాల్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి దేశభక్తి ఉండాలి



ఇల్లంతకుంట: బీజేపీ కార్యకర్తల సమావేశం

ఇల్లంతకుంట: దేశభక్తి మార్గంలో దేశ ప్రజలు నడవాలని, సంకల్పంతో దేశ ప్రధాని హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రారంభించారని బీజేపీ జిల్లా కార్యదర్శి గజబింకార్ చందు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం సన్నాహక సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ముత్తక్క, మండల ప్రధాన కార్యదర్శి సంపత్, నాగసముద్రాల సంతోష్, సాయిగౌడ్, అమ్ముల అశోక్ పాల్గొన్నారు.
సిరిసిల్ల అర్బన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతి సమగ్రతను, ఐక్యతను చాటేలా ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరేయాలని హర్ ఘర్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ రాజు అన్నారు. రగుడులోని మాతృశ్రీ మినీ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు.

మీసేవ కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

ముస్తాబాద్: ప్రభుత్వం గ్రామాల్లో రైతులకు సత్వర ఆన్‌లైన్ సేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు అన్నారు. గూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీలు బొప్ప శ్రీధర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రావు, శంకర్, బాలయ్య, రమేశ్, గిరి, లింగం నరేశ్, భరత్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కోనరావుపేట: ధర్మారంలో సింగిల్‌విండో డైరెక్టర్ సత్యనారాయణరావును బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. కొలనూర్ సింగిల్ విండో డైరెక్టర్ సత్యనారాయణరావు తల్లి ఇటీవల మృతిచెందింది. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పరామర్శించారు. ఆయన వెంట సింగిల్‌విండో చైర్మన్లు సంకినేని రాంమోహన్‌రావు, బండ నర్సయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, మాజీ ఎంపీటీసీ బొడ్డు చంద్రయ్య, నాయకులు రాఘవరెడ్డి, తాళ్లపెల్లి సతీశ్‌గౌడ్, శ్రీనివాస్ తదితరులున్నారు.
వేములవాడరూరల్: శాత్రాజుపల్లిలో కోటగిరి ప్రభాకర్ ఇటీవల మృతిచెందగా.. ఆయన కుటుంబాన్ని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, నూకలమర్రి గ్రామంలో మాజీ సర్పంచ్ పెంద్యాల తిరుపతి సోదరుడు చంద్రకాంత్ గల్ఫ్‌లో మృతిచెందగా.. ఆయన కుటుంబాన్ని బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పరామర్శించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, ఏశ తిరుపతి, బాల్‌రెడ్డి, గొస్కుల రవి, అంజనీకుమార్, పురుషోత్తం, మునీందర్, నల్ల సతీష్‌రెడ్డి, అనిల్, సాయిగౌడ్, స్వామి ఉన్నారు.
ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారులకు మెరుగైన వైద్యమందించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. చిన్నారులను పరామర్శించారు. సద్ది లక్ష్మారెడ్డి, గౌస్, లింగంగౌడ రాంరెడ్డి, బాబు, దేవయ్య, గోపాల్ తదితరులున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ముస్తాబాద్: వెంకట్రావుపల్లెకు చెందిన యువ రైతు కస్తూరి మహేందర్‌రెడ్డి(21) గురువారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పుల బాధలు భరించలేక పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉన్న మహేందర్‌రెడ్డిని ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పులు తీరే మార్గం కనిపించక, అప్పులిచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని తల్లిదండ్రులు పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆర్మ్‌స్ట్రాంగ్‌ను కలిసిన ప్రశాంత్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీ జాతీయ ఫిషరీస్ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను శుక్రవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ సిరిసిల్ల జిల్లా ఫిషరీస్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని ప్రశాంత్ కలిశారు.

బహిరంగ చర్చకు సిద్ధమా?

సిరిసిల్ల అర్బన్: కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధిపై, పద్మశాలీ సామాజికవర్గానికి అందించిన సంక్షేమంపై నేతన్న చౌక్ వద్ద కాంగ్రెస్ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా అని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ అన్నారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

సెల్‌ఫోన్ అప్పగింత

గంభీరావుపేట: మండల కేంద్రంలోని బరిగెలగూడెంకు చెందిన ఇరిగి నవీన్ తన మొబైల్ ఫోన్ పోగొట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రామ్మోహన్ సీఈఐఆర్ ద్వారా అతడి ఫోన్ పట్టుకొని నవీన్‌కు శుక్రవారం అప్పగించారు.

నేడు రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడి రాక

వేములవాడఅర్బన్: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ నూలి శనివారం ఉదయం దర్శించుకోనున్నట్లు తెలిపారు.

డీఐఈవోకు సన్మానం

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వై.శ్రీనివాస్‌ను రాష్ట్ర గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ బాధ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర రెగ్యులర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకచంద్రం, ప్రధాన కార్యదర్శి ఆర్.శేఖర్, ఆర్.లక్ష్మయ్య, నీరటి విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరని లోటు

సిరిసిల్ల టౌన్: సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య(80) మరణించడం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని, ఆయన నిబద్ధత, నిజాయితీ గల కమ్యూనిస్టు అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్ బాబు కొనియాడారు. శుక్రవారం సిరిసిల్ల అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్, ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల పాల్గొన్నారు.

ఎంపీకి ఆహ్వానం లేదు

వేములవాడఅర్బన్: పట్టణంలోని వీటీడీఏ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, పార్లమెంట్ సభ్యుడికి ఆహ్వానం లేకపోవడం ఈ రాష్ట్ర ప్రభుత్వ మొండివైఖరికి నిదర్శనమని బీజేపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ సంతోష్‌బాబు అన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో పూజలు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన మహాలక్ష్మి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి వాయినాలు ఇచ్చుకున్నారు.

చండీ మహాయాగానికి రండి

సిరిసిల్ల: సిరిసిల్ల శివభక్త మార్కండేయస్వామి దేవాలయంలో జరిగే శ్రీచండీ మహాయాగానికి రావాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను సిరిసిల్ల పద్మశాలీ సంఘం ప్రతినిధులు శుక్రవారం ఆహ్వానించారు.

చెట్లను తొలగించొద్దు

బోయినపల్లి: కోరెం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి బూర్గుపల్లి గ్రామ పరిసరాల్లో ఉన్న ఓ గ్రానైట్ క్వారీకి విద్యుత్ సరఫరా చేసేందుకు రోడ్డు పక్కన ఉన్న చెట్లను నరకొద్దని క్యాతం తిరుపతిరెడ్డి జిల్లా కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు.





బోయినపల్లి: మండల కేంద్రం నుంచి వేములవాడ వెళ్లే బీటీ రోడ్డు కల్వర్టు మూల వద్ద ఓపక్క కోతకు గురైంది. ఎదురుగా వాహనం వస్తే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశముంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- నల్లగొండ అనిల్‌కుమార్, బోయినపల్లి

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048

లోకల్ వాయిస్

నిరీక్షణ ఫలించింది



హాకీలో మన దేశం పతకం సాధించడంతో చిరకాల కోరిక నెరవేరింది. ఒలింపిక్స్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించడం ఆనందదాయకం. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతను ప్రోత్సహించాలి. ప్రత్యేక నిధులను కేటాయించి క్రీడాభివృద్ధికి కృషి చేయాలి.

\- దేవత ప్రభాకర్, ఫిజికల్ డైరెక్టర్, సిరిసిల్ల

చేప పిల్లలను వెంటనే అందజేయాలి

ఇల్లంతకుంట: మత్స్య కార్మికుల ఉపాధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే చేప పిల్లలను పంపిణీ చేయాలని ఇల్లంతకుంట మత్స్య కార్మిక సంఘ సభ్యుడు కూనబోయిన రఘు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం అందిన సమాచారం మేరకు.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	00	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	00	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	00	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	00	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	00	1,008
నందీశ్వర్ నాన్‌ఏసీ	00	560
నందీశ్వర సూట్స్	00	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	00	448
పార్వతీపురం స్పెషల్	02	672
పార్వతీపురం సాధారణ	01	336

\- వేములవాడ

మొక్కలు నాటిన ఆర్డీవో



తంగళ్లపల్లి: ఎంపీడీవో కార్యాలయం వద్ద మొక్క నాటుతున్న ఆర్డీవో

తంగళ్లపల్లి: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో సిరిసిల్ల ఆర్డీవో, మండల ప్రత్యేక అధికారి ఎల్.రమేశ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా అఫ్జల్ అహ్మద్ బేగ్, ఏపీవో రాజనర్సు, ఏపీఎం బత్తిని పర్శరాములు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.
సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2వ వార్డులో వన మహోత్సవం కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళాచక్రపాణి పాల్గొని ప్రారంభించారు. 39వ వార్డులో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, భూక్య రెడ్డినాయక్, అడ్డగట్ల మాధవిమురళి, కుడికాల రవి తదితరులు పాల్గొన్నారు.
గంభీరావుపేట: మండలంలో పలు శాఖల అధికారులు మొక్కలు నాటారు. ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.
వీర్నపల్లి: మండలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని తహసీల్దార్ మారుతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 1,700 మొక్కలు నాటామన్నారు.
కోనరావుపేట: మండలంలో రోడ్లకిరువైపులా మొక్కలు నాటారు. కార్యదర్శులు, గ్రామస్తులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.
ముస్తాబాద్: స్వచ్ఛదనం-పచ్చదనంలో అందరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేకాధికారి లత అన్నారు. ముస్తాబాద్ కస్తూర్బా స్కూల్‌లో మొక్కలు నాటారు. తహసీల్దార్ సురేశ్, ఎంపీవో బీరయ్య తదితరులు పాల్గొన్నారు. దోమలు, సీజనల్ వ్యాధుల నివారణకు డ్రై డే పాటించాలని తహసీల్దార్ సురేశ్ కోరారు. ముస్తాబాద్‌లో డ్రై డే నిర్వహించారు.
ఎల్లారెడ్డిపేట: పరిశుభ్రత, పచ్చదనం అందరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఎంపీడీవో సత్తయ్య అన్నారు. అక్కపల్లి, అల్మాస్‌పూర్, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో మొక్కలు నాటారు. మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, మాజీ సర్పంచులు ముక్క మధుకర్, రాధారపు పుష్పల, పాశం సరోజన తదితరులు పాల్గొన్నారు.
ఇల్లంతకుంట: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. రేపాక గ్రామ ఒకటో నంబర్ అంగన్వాడీ సెంటర్‌లో మొక్కలను నాటారు. గుండ్రెడ్డి రాజవ్వ మీనారెడ్డి, పుల్లూరి లక్ష్మి వెంకటయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు వైకుంఠ రథాన్ని రూ.1,30,000తో నిర్మించి గ్రామ పంచాయతీకి విరాళంగా అందజేయగా.. ఎమ్మెల్యే ప్రారంభించారు. మాజీ ఎంపీపీలు వి.వెంకటరమణారెడ్డి, గుడిసె ఐలయ్యయాదవ్, చిట్టి ఆనందరెడ్డి, కేశవరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ

ఎల్లారెడ్డిపేట: బండలింగంపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానానికనుగుణంగా కంప్యూటర్ విద్యనందించడానికి ఎన్నారైలు చేయూతనందించారు. రూ.20వేలు వితరణ చేసి విద్యార్థులకు కంప్యూటర్‌ను అందజేశారు. అమెరికాలో స్థిరపడ్డ శనిగరపు ప్రవీణ్, శనిగరపు నవీన్ తమ బంధువు రామగిరి దేవేందర్ ద్వారా అందజేశారు.
మొబైల్ మైక్ సెట్..
సిరిసిల్ల ఎడ్యుకేషన్: 2018 నుంచి జెడ్పీహెచ్ఎస్ వెంకంపేట పాఠశాలలో సాన బాబు పని చేశారు. ఇటీవల గాలిపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన రూ.17వేల విలువైన మొబైల్ మైక్ సెట్‌ను పాఠశాలకు అందజేశారు.

విద్యార్థులకు చేయూత

వీర్నపల్లి: సీతారాంనాయక్‌తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీ కార్డ్ నిమిత్తం మాజీ సర్పంచ్ రవినాయక్, రాజునాయక్ రూ.3,000 విరాళంగా ఇచ్చారు.

సీజనల్ వ్యాధులపై వైద్యశిబిరం

కోనరావుపేట: మామిడిపల్లిలో సీజనల్ వ్యాధులపై వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

దృఢమైన సంకల్పం అలవర్చుకోవాలి

ఎల్లారెడ్డిపేట: ప్రతి ఒక్కరూ మానసిక సమస్యలను అధిగమించి దృఢమైన సంకల్పంతో ముందుకు సాగాలని ప్రముఖ మానసిక వైద్యుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక సమస్యలు, మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.